ప్రజలదృష్టి మళ్లించడానికే కేటీఆర్‌పై కేసు

కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం

కల్వకుర్తి, డిసెంబర్ 19 : ఇచ్చిన హామీలు అమలుపర్చడంలో బొక్కా బోర్లా పడ్డ రేవంత్‌సర్కార్ ప్రజల దృష్టిని మళ్లించడానికి కేటీఆర్‌పై కేసునమోదు చేసిందని మున్సిపల్‌చైర్మన్ ఎడ్మసత్యం మండిపడ్డారు. సంవత్సరకాలంలోనే ప్రజావిశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనను గాలికొదిలేసి పిల్లి మొగ్గలు వేస్తుందని దుయ్యబట్టారు. కేసులతో బయపెట్టాలని చూస్తున్న కాంగ్రెస్‌ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకునే రోజు అతి దగ్గరలోనే ఉందని వారు హెచ్చరించారు. కేసులను చట్టపరంగా న్యాయస్థానాల్లో ధీటుగా ఎదుర్కొంటామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరగడబడుతున్నారని, కేసులతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే విధంగా కాంగ్రెస్ పరిపాలన సాగుతుందని ఎద్దేవా చేశారు. పోలీసులను అడ్డం పెట్టుకుని రేవంత్ సర్కార్ మనుగడ సాగిస్తుందని, సీఎం రేవంత్‌తో పాటు మంతులు, ఎమ్మెల్యేలు భద్రతా సిబ్బంది లేకుండా ప్రజల్లోకి రావాలని సవాల్ విసిరారు. నిజంగా అదే విధంగా ప్రజల్లోకి వస్తే గుడ్లు, టమాలతో సన్మానం ఉంటుందని సత్యం అన్నారు.చిల్లర పనులకు, కేసులకు బీఆర్ఎస్ భయపడదనే విషయాన్ని రేవంత్ సర్కార్ గుర్తుంచుకుంటే మంచిదని సత్యం హెచ్చరించారు.

కేసునమోదు చేయడం అన్యాయం

వంగూరు, డిసెంబర్ 19 : మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రభుత్వం ఏసీబీ ద్వారా కేసునమోదు చేయించడం అన్యాయమని కేటీఆర్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు అంకు సురేందర్ గురువారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. రాష్ట్రాన్ని ప్రపంచస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చే విషయంలో ఈ-కార్ రేస్ సంస్థకు నిధులు విడుదల నెపంతో ప్రభుత్వం కుట్రచేసి కేసునమోదు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని నిత్యం మాజీ మంత్రి కేటీఆర్ వారిని ప్రశ్నిస్తుంటే విషయాన్ని పక్కదారి పట్టించడంతో పాటు భయపెట్టి రాజకీయం చేయాలని చూస్తున్న సర్కార్‌ను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎన్ని కుట్రలు చేసినా ప్రజలచేతిలో మీకు భంగపాటు తప్పదని ఆయన పేర్కొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

లింగాల, డిసెంబర్ 19 : చదువులో రాణించినప్పుడే ఉజ్వల భవిష్యత్ సాధించవచ్చని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. గురువారం మండలకేంద్రంలో ఎస్సీ గురుకుల పాఠశాల, పీహెచ్‌సీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో విద్యార్థులతో సమావేశమై ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచే చక్కని క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. ప్రణాళిక బద్ధంగా ఇష్టపడి చదువుతూ నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు.

సాగునీటి ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తాం

బల్మూరు, డిసెంబర్19 : అచ్చంపేట ప్రాంతంలోని బల్మూరు సమీపం లో ఉమామహేశ్వర సాగునీటి ప్రాజెక్టును త్వరలో పనులను ప్రారంభించి పూర్తి చేస్తామని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. గురువారం మండలకేంద్రమైన బల్మూరులో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఆర్థికమంత్రితో సమావేశమైన తరువాత పనులను చేస్తామన్నారు.

కార్యక్రమంలో జిల్లా యువజన ఉపాధ్యాక్షులు శ్రీనివాస్‌రాథోడ్, వెంకట్‌రెడ్డి, ఖదీర్, సంధ్యారెడ్డి, చంద్రమోహన్, శ్రీపతి రావు, వెంకట్‌స్వామి, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

రాష్ట్రపతికి పోస్టుకార్డు

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 19 : వారణాసిలోని రాజ్‌ఘాట్ వద్ద ఉన్న సర్వోదయ సేవ సంఘం ఆధ్వర్యంలోని ఆస్తుల కూల్చివేతకు నిరసనగా గురువారం తెలంగాణ సర్వోదయ సేవాసంఘం నాయకులు రాష్ట్రపతికి పోస్టుకార్డులు పంపించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గిరిప్రసాద్ మాట్లాడుతూ రైల్వేశాఖ కూల్చివేసిన స్థలంలో పాఠశాల, గ్రంథాలయాలు ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రపతి జోక్యం చేసుకొని న్యాయంచేయాలని పోస్టుకార్డు ద్వారా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రామయాదవ్, ప్రదీప్, ఈశ్వర్, నిరంజన్ పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఇంట్లో తనిఖీ చేస్తున్న క్లూస్‌టీమ్ పోలీసులు

- **500గ్రాముల వెండి ఎత్తుకెళ్లిన దుండగులు**

పెంట్లవెల్లి, డిసెంబర్ 19 : తాళంవేసిన ఇంట్లో బీరువాలోఉన్న వెండిని గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లిన ఘటనా మండలకేంద్రంలో గురువారం ఘటనకు సంబంధించి ఎస్సై రామన్‌గౌడ్ కథనం మేరకు.. మండలకేంద్రంలో పీహెచ్‌సీ సమీపంలో నివాసం ఉంటున్న బర్ల ఏకంబారంరెడ్డి గతవారం రోజుల క్రితం ఇంటికితాళం వేసి కుటుంబ సభ్యులతో కలసి షాద్‌నగర్‌కు తమబంధువుల ఊరికి వెళ్లారు. గురువారం రోజు ఉదయం ఇంటిపక్కల వారు తలుపులు తెరుచుకొని ఉండడాన్ని గమనించి ఏకాంబరంరెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులతో హుటాహుటిన పెంట్లవెల్లిలోని తమఇంటికివచ్చారు. తాళాలుపగిలిపోయి తలుపులు తెరుచుకొని ఉండడంతో ఇంట్లోకి వెళ్లిచూడగా బీరువాను పగులగొట్టి అందులో ఉన్న 500గ్రాముల వెండిని ఎత్తుకెళ్లిన గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికెళ్లి క్లూస్ టీమ్ పరిశీలించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

గుడిసె దగ్ధం.. ఆస్తినష్టం

ఉప్పునుంతల, డిసెంబర్ 19 : మండలంలోని పెనిమిళ్లలో గురువారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగి గుడిసే పూర్తిగా కాలిపోయింది. బాధితుని కథనం ప్రకారం పెనిమిళ్లలో కృష్ణయ్య కుటుంబసభ్యులు బుధవారం గుడిసెలో వంటచేసుకొని భోజనం తర్వాత నిద్రించడానికి పక్క ఇంటికి వెళ్లి నిద్రపోయారు. ప్రమాదవశాత్తు గురువారం తెల్లవారుజామున గుడిసెలో మంటలు చెలరేగి గుడిసె పూర్తిగా దగ్ధమైంది. గుడిసెలో దాదాపు రూ.2లక్షలవరకు వస్తువులు, తిండి గింజలు మంటలో కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు.

బాధితుని ఫిర్యాదుమేరకు ఆర్ఐ పద్మ వెళ్లి పంచనామా నిర్వహించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★హరి డే కేర్ ఆసుపత్రిలో పని చేయుటకు నర్సింగ్ స్టాఫ్ కావలెను. సంప్రదించవలసిన సెల్ నెం.8328035779.
NT- MBNR

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

మెనూప్రకారం భోజనం అందించాలి

- **పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ సంతోష్**

వంగూరు : జాజాల పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ సంతోష్

వంగూరు, డిసెంబర్ 19 : ప్రభుత్వ పాఠశాలల్లో మెనూప్రకారం విద్యార్థులకు భోజనం అందించకపోతే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ బాదావత్ సంతోష్ హెచ్చరించారు. మండలంలోని జాజాల ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ ఆరగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ఆరోగ్యంతో పాటు చదువు ఎంతో ప్రాధాన్యమైందన్నారు. పాఠశాల వసతులు, భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి వ్యత్యాసం రావొద్దన్నారు. విద్యార్థుల నుంచి భోజన నాణ్యతపై ఫీడ్‌బ్యాక్ తీసుకుని వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా మెనూపక్కాగా అమలుచేయాలని మధ్యాహ్నభోజన వంట సిబ్బందికి సూచించారు. ఇకపై పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని ఎలాంటి లోపం వున్న కఠిన చర్యలు తీసుకుంటామని ఉపాధ్యాయులను కలెక్టర్ హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీవో విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు పీఎంకిసాన్ లబ్ధి చేకూర్చాలి

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 19 : పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి యోజన పథకం ద్వారా జిల్లాలోని అర్హులైన రైతులకు పీఎం కిసాన్‌లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలస్థాయి వ్యవసాయాధికారులకు పీఎం కిసాన్ సమృద్ధి యోజన పథకంపై అవగాహన కల్పించేందుకు సమావేశం నిర్వహించారు. పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం చిన్న సన్నకారు రైతులకు ఏడాదికి రూ.6వేల వరకు కనీస ఆదాయ మద్దతును అందించడమే లక్ష్యమన్నారు. నాగర్‌కర్నూల్‌లో 2019 సంవత్సరానికి సంబంధించిన పాస్‌పుస్తకాలు కలిగి ఉండి అర్హులైన రైతులకు పీఎం కిసాన్ సమృద్ధి లబ్ధి చేకూరే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లాలో 1,94,908 మంది రైతులకు పీఎం కిసాన్ ద్వారా రూ.55.22 కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా రైతులకు అందించే పీఎంకిసాన్ సమృద్ధి యోజన పథకం ద్వారా జిల్లాలో అర్హులైన రైతులను గుర్తించి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. మూడు విడతలుగా 2 వేల చొప్పున ఏడాదికి 6 వేలు బ్యాంకుల్లో జమచేస్తారని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇండ్లసర్వే పకడ్బందీగా చేపట్టాలి

చారకొండ, డిసెంబర్ 19 : ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న మొబైల్ యాప్ సర్వేను పంచాయతీ కార్యదర్శులు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. గురువారం మండలంలోని జూపల్లిలో ఇండ్లసర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లసర్వేను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తప్పులు లేకుండా చేయాలని చెప్పారు. ప్రతిరోజూ సర్వే నివేదికలు ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుందన్నారు. ఈనెలలోపు సర్వే వందశాతం అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఏమైనా సందేహాలుంటే పంచాయతీ కార్యదర్శులకు సంప్రదించాలన్నారు. 7,284మంది ఇండ్లకోసం దరఖాస్తు చేసుకోగా 2,100 మంది వివరాలు యాప్‌లో నమోదు చేసినట్లు ఎంపీడీవో ఇసాక్‌హుస్సేన్ తెలిపారు. కలెక్టర్‌వెంట తాసీల్దార్ సునిత, ఎంపీడీవో ఇసాక్‌హుస్సేన్, ఎంపీవోవెంకటేశ్, కార్యదర్శి శ్రవణ్‌కుమార్ ఉన్నారు.

కల్వకుర్తిలో..

కల్వకుర్తి రూరల్, డిసెంబర్ 19 : గ్రామ గ్రామాన నిర్వహిస్తున్న ఇండ్ల సర్వేను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని రఘుపతిపేటలో నిర్వహిస్తున్న ఇండ్లసర్వేను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా సర్వేలను ఎంపీడీవో వెంకట్రాములు పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భారతమ్మ పాల్గొన్నారు.

నేడు రుణమాఫీ కాని రైతుల సమావేశం

కల్వకుర్తి, డిసెంబర్ 19 : రుణమాఫీ కాని రైతులతో శుక్రవారం వ్యవసాయమార్కెట్ యార్డులో సమావేశం నిర్వహిస్తున్నామని రైతుసంఘం నాయకులు తెలిపారు. పార్టీలకు అతీతంగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి రుణమాఫీ కాని రైతులు హాజరుకావాలని వారు కోరారు.

యూటీఎఫ్ మండలాధ్యక్షుడిగా నెహ్రూప్రసాద్

కల్వకుర్తి రూరల్, డిసెంబర్ 19 : మండలంలోని యూటీఎఫ్ అధ్యక్షుడిగా నెహ్రూప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో సంఘం నాయకులు బాలరాజు, రామేశ్వరయ్య, ఆంజనేయులు ఆధ్వర్యంలో మండల నూతన కమిటీనీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా నెహ్రూప్రసాద్, ప్రధానకార్యదర్శిగా రాజా ఉపాధ్యక్షుడిగా ఆంజనేయులు, ప్రసన్న, కోశాధికారిగా సత్యనారాయణ కమిటీసభ్యులుగా పలువురిని ఎన్నుకున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

వెల్దండ, డిసెంబర్ 19 : సీఎం సహాయనిధి పేదలకు వరం అని మాజీసర్పంచ్ భూపతిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కంటోన్‌పల్లికి చెందిన ఆర్ల వెంకటమ్మ, తోటలక్ష్మి, పెద్ది యాదమ్మలకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులకు కంటోన్‌పల్లి మాజీసర్పంచ్ పెద్ది రామకృష్ణతో కలిసి మాజీసర్పంచ్ భూపతిరెడ్డి బాధితులకు మండల కేంద్రంలో అందజేశారు.

జ్యోతిరావుపూలే ఆశయసాధనకు కృషి చేయాలి

బిజినేపల్లి, డిసెంబర్ 19 : నిరంతరం ప్రతిఒక్కరూ జ్యోతిరావుపూలే ఆశయ సాధనకోసం కృషి చేయాలని బీసీ సంఘం నాయకులు పర్వతాలు అన్నారు. గురువారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆనాడు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రఘు, రాజేందర్‌గౌడ్, రమణగౌడ్, చెన్నయ్య ఉన్నారు.

నకిలీ బోనఫైడ్‌ల ఘటనలో విచారణ చేపట్టాలి

అచ్చంపేట రూరల్, డిసెంబర్ 19 : నల్లమల ఏజెన్సీ ప్రాంతంలో నకిలీ బోనఫైడ్‌లతో ఉద్యోగాలు పొందిన ఘటనలో పూర్తిస్థాయిలో విచారణ చేయాలని గిరిజన సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి శంకర్‌నాయక్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అనేకరంగాల్లో ఉద్యోగాలు పొందినవారిని, సర్టిఫికెట్లు జారీచేసిన అధికారులను చట్టప్రకారం శిక్షించి సర్వీస్‌నుంచి రిమూవల్ చేయాలని డిమాండ్ చేశారు.

కంప్యూటర్ల వితరణ

పెద్దకొత్తపల్లి, డిసెంబర్ 19 : మండలంలోని పెద్దకార్పాముల గ్రామంలోని జెడ్పీ పాఠశాలకు రోటరీక్లబ్, రత్నగిరి ఫౌండేషన్ సంయుక్తంగా 15 కంప్యూటర్లను గురువారం హెచ్ఎంకు అందజేశారు. కార్యక్రమంలో ధర్మతేజ, బాలకోటి రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు ఇంకెప్పుడు?

నాగర్‌కర్నూల్ రూరల్, డిసెంబర్ 19 : జిల్లాలోని అన్ని మండలాల్లో చేపట్టిన మనఊరు మనబడి పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని ఎంపీపీ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ బదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. రెండేండ్లక్రితం జిల్లాలోని అన్ని మండలాలకు సంబంధించిన గ్రామాల్లో నూతన పాఠశాల భవనాలు నిర్మించడం, పాతపాఠశాల భవనాలకు గదులు, కిటికీలు తదితర వాటికి సొంతడబ్బులతో చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటికైనా బిల్లులు చెల్లించాలని, పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

ఆర్టీసీబస్సులో డీజిల్ చోరీ

అచ్చంపేట, డిసెంబర్ 19 : నైట్‌హాల్ట్‌లో ఉన్న బస్సు నుంచి గుర్తు తెలియని వ్యక్తులు డీజిల్ చోరీ చేసిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటు చేసుకున్నది. ఎస్సై నాగరాజు కథనం మేరకు.. కల్వకుర్తి డిపోకు చెందిన బస్సు (ఏపీ 22 జెడ్ 0137) బుధవారం రాత్రి 11 గంటలకు లింగాలకు వచ్చి డ్రైవర్ సుల్తాన్, కండక్టర్ జాఫర్‌ఖాన్ బస్సును నిలిపి అక్కడే బస చేశారు. గురువారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో నిద్రలేచిన డ్రైవర్ టైర్లను చెక్ చేస్తుండగా.. డీజిల్ వాసన రావడంతో ట్యాంక్ వద్దకు వెళ్లి చూడగా ట్యాంక్ ఖాళీగా కనిపించింది. ట్యాంక్‌లో సుమారు 200 లీటర్ల వరకు డీజిల్‌ను చోరీ చేశారని డ్రైవర్ తెలిపాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తగ్గేదేలే అంటున్న సమగ్రశిక్షా ఉద్యోగులు

బోనాలతో ర్యాలీ నిర్వహిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

- **పదో రోజుకు చేరిన సమ్మె**
- **బోనాలతో నిరసన వ్యక్తం చేసిన ఉద్యోగులు**

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 19 : సమస్యల పరిష్కారంకోసం సమ్మెకు దిగిన సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మె నుంచి తగ్గేదే లేదని భీష్మించి కూర్చున్నారు. ఇందులో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలో పదోరోజు మహిళా ఉద్యోగులు బోనాలు పట్టణంలో డప్పులు కొడుతూ నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో ర్యాలీ నిర్వహించి బోనాలతో మానవహారం నిర్వహించారు. తమ హక్కులను, సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చాలని నినదించారు. 2023లో అక్టోబర్ 13న హన్మకొండలోని ఏకశిలి పార్కు దీక్షా శిబిరంలో ఇచ్చిన హామీ మేరకు తక్షణమే పేస్కెల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రీఎంగేజ్‌విధానం తొలగించి ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజ్ కల్పించాలని, హెల్త్ ఇన్సూరెన్స్, ఎక్స్‌గ్రేసియా కల్పించాలని డిమాండ్ చేశారు.

రైతులను ఇబ్బందులు పెడుతున్న బ్యాంక్ అధికారులు

బల్మూరు, డిసెంబర్ 19 : మండలకేంద్రంలో యూనియాన్ బ్యాంక్ అధికారులు రైతులను నానా ఇబ్బందులు పెట్టడం జరుగుతుందని గురువారం తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం రైతు రుణమాఫీ విషమంలో రైతులు రెన్యూవల్ చేసుకోవాలని గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి రైతులను నేరుగా పిలిపించుకొని పంట రుణాలను త్వరగా చెల్లించాలని రైతులను భయాందోళనకు గురిచేసేవిధంగా మాట్లాడడం జరుగుతుందన్నారు. మేనేజర్ బ్యాంక్‌లో బంగారంపై తీసుకున్న రుణాలను అప్పులు చేసి రెన్యూవల్, పూర్తిగా చెల్లిస్తే వాటికి సంబంధించిన పైసలను క్రాప్‌లోన్ ఖాతాలో వేసి పూర్తి చేయాలని రైతులను ఇబ్బందులను పెట్టడం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. ఇటీవల రైతులకు పంటరుణాలు మాఫీచేస్తే రైతులు మళ్లీ క్రాప్‌లోన్ తీసుకోవడానికి వస్తే రైతుల నుంచి డిపాజిట్ పేరుతో ఖాతాలో పైసలను బలవంతంగా రైతులనుంచి పెట్టించుకోవడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిపాజిట్‌లో ఉంచిన రైతులు ఖాతాలో చూపించడం లేదని రైతులు వాపోతున్నారు. ఇన్సూరెన్స్ పేరులతో రైతుల, వినియోగదారుల నుంచి పైసలను కట్టించుకోవడం జరుగుతుందని వాటిని సంబంధించిన ధృవీకరణ పత్రాలను ఇవ్వడం లేదన్నారు. ఇలాఅయితే అచ్చంపేట ఎస్‌బీఐ బ్యాంక్‌లో జరిగిన సంఘటన జరుగకముందే అధికారులు, పాలకులు బ్యాంక్ అధికారులతో మాట్లాడి రైతులకు న్యాయం చేయాలన్నారు. రైతులకు జరుగుతున్న ఇబ్బందులను వెంటనే సంబంధింత అధికారులు తనిఖీచేసి, పూర్తివిచారణ చేయాలని, రైతులను ఆదుకోవాలని మండలంలోని రైతులు, వినియోగదారులు కోరుతున్నారు.

కేంద్రహోంమంత్రి వెంటనే రాజీనామా చేయాలి

నాగర్‌కర్నూల్‌లో స్వేరోస్ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతన్న నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్, డిసెంబరు 19 : కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ను హేళన చేసి అవమానించిన ఘటనపై జిల్లాకేంద్రంలోని స్వేరోస్ ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బండమీది కృష్ణ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. అంబేద్కర్‌ను అవమానపర్చడం బాధాకరమన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డపాకుల శివశంకర్, సోషల్ మీడియా కమాండర్ సంపత్‌కుమార్, ధర్మరాజు డిమాండ్ చేశారు. కాగాబహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్రప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న, అధ్యక్షుడు బోనాసి రాంచందర్, పృథ్వీరాజ్‌లు అసెంబ్లీ అధ్యక్షుడు కల్యాణ్, బాలనాగులు, మధు పాల్గొన్నారు.

కోడేరులో..

కోడేరు డిసెంబర్ 19 : అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. మండలకేంద్రం బస్టాండ్ కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు.

పెంట్లవెల్లిలో..

పెంట్లవెల్లి, డిసెంబర్ 19 : అమిత్‌షాను మంత్రిపదవి నుంచి తొలగించాలని కేవీపీఎస్ ఆధ్వర్యంలో గురువారం మండలకేంద్రంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు తిమ్మస్వామి, రాము, లక్ష్మయ్య, సురేశ్, మాధవి, లక్ష్మి, చెన్నమ్మ, కాశన్న ఉన్నారు.

నాగర్‌కర్నూల్‌లో బీఎస్పీ ఆధ్వర్యంలో ర్యాలీ..

కోడేరులో అఖిలపక్షం ఆధ్వర్యంలో..

పెంట్లవెల్లిలో నిరసన తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు

టాలెంట్‌టెస్ట్‌లో విద్యార్థికి ప్రథమస్థానం

కొల్లాపూర్‌రూరల్, డిసెంబర్ 19 : జిల్లాస్థాయిలో బయోసైన్స్ ట్యాలెంట్ టెస్ట్‌ను నాగర్‌కర్నూలులో నిర్వహించారు. కొల్లాపూర్‌కు చెందిన జిల్లా పరిషత్ గాంధీ మెమోరియల్ ఉన్నత పాఠశాలకు చెందిన కె.వెంకటేశ్ జిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా హెచ్ఎం శోభారాణి, ఉపాధ్యాయులు వెంకటేశ్‌ను ఈ స్థాయికి కృషి చేసిన ప్రవీణ్ కుమార్‌లను సన్మానించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ.. ప్రథమ స్థానం సాధించినందుకు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో ఇంకా ఉన్నతస్థాయికి ఎదగాలని గురువులకు తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అర్జున్‌గౌడ్, కృష్ణ, నరేందర్‌రెడ్డి, విజయలక్ష్మి, భాస్కర్, గాల్‌రెడ్డి నారాయణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు అభినందనలు

కల్వకుర్తి రూరల్, డిసెంబర్19 : జాతీయ ఉత్తమ సైన్స్ అవార్డును దక్కించుకున్న జిల్లా డీఎస్‌వో రాజశేఖర్‌కు టీయూటీఎఫ్ జిల్లాధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శైలం, రవీందర్‌లు గురువారం ప్రకటనలో అభినందనలు తెలిపారు. డీఎస్‌వో అవార్డు దక్కించుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ భవిష్యత్‌లో మరిన్ని అవార్డులను అందుకోవాలని ఆకాంక్షించారు.

విద్యార్థులకు సికిల్‌సెల్ అనీమియా వైద్యపరీక్షలు

దోమలపెంట, డిసెంబర్ 19 : మండలంలోని దోమలపెంటలో సికిల్‌సెల్ అనీమియా వ్యాధులను నిర్ధారించేందుకు గురువారం ఈగలపెంట డీఏవీ హైస్కూల్‌లో ఆరోగ్యకేంద్రం సిబ్బంది జ్యోతి ఆధ్వర్యంలో విద్యార్థుల రక్తనమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆరోగ్యకేంద్రం సిబ్బంది జ్యోతి మాట్లాడుతూ సికిల్‌సెల్ అనీమియా ఎర్రరక్త కనాలను 'కోడవలి'ఆకారాన్ని పొందేలా చేయడం ద్వారా వాటిని నాశనం చేసే వంశపారంపర్య వ్యాధి అన్నారు. కార్యక్రమంలో ఆశవర్కర్ చంద్రకళ, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కల్వకుర్తి, డిసెంబర్ 19 : ఆమనగల్లు సీనియర్ నాయకులు ఎంగలి రఘు కుటుంబాన్ని గురువారం మున్సిపల్‌చైర్మన్ ఎడ్మ స